

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 12 నవంబర్, 2015 సంచిక : 6

**సంస్థాపకులు :**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా.......... రూ॥ 160/-

ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
మళ్లీ మళ్లీ .......... 4
విశ్వాసం .......... 5
శక్తి తరంగాలు .......... 7
జ్ఞానధామం, సంస్మరణిక .......... 9
సన్న్యాసిలో... .......... 10
శ్రీరామా .......... 12
పంచామృతం .......... 13
జ్ఞానులతత్త్వం .......... 14
షిరిడీ డైరీ .......... 17
శ్రీ గజానన విజయం .......... 19
చదవండి-ఆలోచించండి .......... 22
బాలవాణి .......... 23
నిశ్శబ్దప్రేమ .......... 26
బుభు గీత .......... 28
శ్యామకర్ణ .......... 30
హెచ్చరిక .......... 32







# మా వాణి



క్షణాలు నిమిషాలుగా - నిమిషాలు గంటలుగా, రోజులుగా, వారాలుగా మారుతూ దొర్లుతూ మూడు నెలలు గడిచిపోయాయి. మీ పాలకువ కనలేక, మీ పలుకు వినరాక, శూన్యంలో మీ అడుగుల జాడలు లేక మేమే శూన్యమైపోయాం ప్రభూ! రేపుకు రూపు లేదు, నిన్న మరలిరాదు- అని తెలిసినాగానీ నిన్నలో లయించిన మీ కోసం తపిస్తూ .... రేపటిపై ఆశ నింపుకొనే ప్రయత్నం చేస్తూ ......

వేకువలు, అల్పాహార వేళలు, భోజన వేళలు, సత్సంగ సమయాలు ...... అన్నీ వస్తున్నాయి, పోతున్నాయి. రాత్రి వచ్చిన చీకటి తెల్లవారికి విడిపోతున్నది. పగటి ఎండ సాయంత్రానికి చల్లబడుతున్నది. కానీ, మా హృదయాలను ఆవరించిన అంధకారాన్ని పటాపంచలు చేయగల రవి కిరణం కనరాదేమి స్వామి! ఆ చంద్రికా శీతల దరహాసం కోసం మా వెదుకులాటకు అంతులేదు గదా యిక!

మీరు వేలాడదీయించిన అట్టపెట్టెల నిండా పిచ్చుకలు గూళ్లు పెట్టు కుంటున్నాయి. ఒకటే కిచకిచలు. మీ కుక్కపిల్లలన్నీ ప్రతిరోజూ అయిదారు సార్లు మీ కుర్చీ దగ్గరకు వచ్చి, దీనంగా చూచి, మెల్లగా వెళ్లిపోతున్నాయి. సీత వచ్చి మీ దర్శనం చేసుకొని, అరటిపండు తిని వెడుతున్నది. 'అఉ ఈ' 'అఉఈ' అని కూస్తుంటాయే పొడవు ముక్కులుండే చిట్టి పిట్టలు- అవి ఉసిరి చెట్టు మీద కూర్చొని మిమ్మల్ని పిలుస్తున్నాయి. 'అఉఈ(ప్రభుజీ)' అని. మొన్నటి వానలకి పట్టెడంత సీతాఫలాలు ఎంచక్కా కళ్లు విచ్చుకున్నాయి. అన్నట్లు మీరు ఎంతో ప్రేమగా ఏరితెచ్చుకొని బల్లమీద రాశిపోసుకునే పున్నాగపూలు-ఏరే వారు లేక- మీ కోసం కిటికీలోంచి

పరిమళాలు మీ గదిలోకి పంపి ఉస్సురని నిట్టూరుస్తున్నాయి. అన్నట్లు, గురువుగారండీ! మీకోసం సుధీర, చైత్ర రేగు పళ్లు కోసుకొచ్చి, మీ కుర్చీలో పెట్టి కన్నీళ్లు పెట్టుకొంటున్నారు. కలలోనైనా కనిపించరూ వాళ్లకు!

మొన్నటికి మొన్న మీ దగ్గర సన్న్యాసదీక్ష తీసుకున్న పెద్దాయన "స్వామీ సత్యప్రకాశానంద ప్రభు" మహరాజ్ వారికి నూరవ జన్మదినం జరుపుకొన్నారు-వారి కుమారులంతా వచ్చి. ఆ రోజంతా మీ మాటలే గుర్తు చేసుకొంటూ కరిగి కన్నీరయ్యారందరూ. మీ పిచ్చితల్లి మీ గది తలుపు తెరిచి మీరు కూర్చున్న కుర్చీ ముందర కూర్చొని, అక్కడ లేని మీ పాదాలనే చూస్తూ, తన తల మీద మీ చేతి స్పర్శను భావిస్తూంటే క్షణక్షణం ఆమె గుండె కార్చే కన్నీళ్లు మీకు కనపడటం లేదా స్వామీ!

మీరు నిర్దాక్షిణ్యంగా మమ్మల్ని వదిలి వెళ్లిపోయినా మేము మిమ్మల్ని వదలదలుచుకోలేదు. మీ జ్ఞానధామంలో కూర్చొని ధ్యానం చేసుకొనే ప్రయత్నం చేస్తాం. చంచలమనస్కులమైనప్పుడల్లా కళ్లు తెరిచి మీ విగ్రహం వైపు చూస్తాం. మీరు ప్రేమగా, దయగా మావైపు చూస్తారు. సాయిబాబా వారు తమ విగ్రహానికీ, తమకూ భేదం లేదన్నారు. సాయే జీవంగా, ఆయన బోధలే జీవితంగా, ఆయన శక్తిని ఆవాహన చేసుకున్న మీ విషయంలోనూ అంతేగదా! మీ కళ్లలోంచీ వచ్చే మెత్తని ప్రేమమయమైన ఆ చూపే మమ్మల్ని మళ్లీ దారిలోకి లాక్కువస్తుంది. మీదైన భావసేవలో తరించగలిగే శక్తి మాకు ప్రసాదిస్తుంది. ఆ విశ్వాసంతోనే మేమంతా యింకా బ్రతికున్నాం.

గురుదేవా, మా మనసులు మీవిగా చేసుకోండి. మా ఆలోచనలన్నీ మీ సంకల్పాలతోనే నిండేలా చెయ్యండి. మా ప్రతి అడుగూ సన్మార్గంలోనే పడేలాగా చెయ్యిపట్టి నడపండి. మా జీవితాలు చరితార్థం చేసుకోగలిగే భాగ్యం మాకు ప్రసాదించండి. తల్లిని తదేకంగా చూచే తాబేటి పాపలుగా మేము మనగలిగేలా ఆశీర్వదించండి. తెరచాప నిండా కన్నాలు, బలం చాలని తెడ్లు, పెనుగాలులు, కన్నీటి కడలిలో ప్రయాణం. ఈ పడవలను మీరు దరిజేర్చవలసిందే ప్రభూ!





# మళ్లీ మళ్లీ

– సుమలత

ఆత్మ నిష్ఠ యనెడి గౌతమర్షివీడి
మాయయనెడి ఇంద్రుని వశమైతినయ్యా!
బండగా మారిపోయెను గుండె నేడు
చరణ ధూళిని విదుపవా సాయిరామ !

లోభమనియెడి జింకకు లొంగిపోయి
మోహమనియెడి రావణు మాయ చిక్కి
లంపటపు లంకలోన అల్లాడుచుంటి
సహన మారుతి నంపవో సాయిరామ !

గహన సంసారమనియెడి గంగపైన
ఇటునటు తిరుగుచుంటినే నిన్నినాళ్లు
నావపై నీ చరణ ముంచి నడుపు చుండి
సరగదరిజేర్చవమా నన్ను సాయిరామ !

ఆవరించిన ఆ మృత్యు యవనికకటు
వైపు కలదేమొ కనలేక - వెర్రివాని
వోలె నిలచినా నిట - గురువుకన రాక
సరగ దరిజేర్చుకో నన్ను సాయిరామ !

# విశ్వాసం

**- మాతా శుకవాణి**

ధైర్యమే శక్తి - ధైర్యమే రక్ష - అని పెద్దలు అంటూ ఉంటారు. ధైర్యం దేనిలో నుండీ వస్తుంది? తన మీద తనకు నమ్మకం పెరుగుతోంటే ధైర్యం పెరుగుతుంది. ఆ ధైర్యం మరింత విశ్వాసాన్ని పెంచి మనను ముందుకు నడుపుతుంది-అంటారు వివేకానందులు. "నీవు ఏ కార్యక్షేత్రంలోగానీ, ఆధ్యాత్మికరంగంలోగానీ రాణించాలంటే బలం చాలా ముఖ్యం. బలం కావాలంటే నీలోని భీతి పోవాలి. అందుకు నీపై నీకు విశ్వాసం (ఆత్మ విశ్వాసం) కలగాలి' - అన్నది విశ్లేషణ.

మనిషికి నాలుగు రకాల విశ్వాసాలుండాలని ఆర్ష వాక్కు. అందులో మొదటిది ఆత్మవిశ్వాసం, రెండవది గురువిశ్వాసం. ప్రతి వారికీ ఎవరో ఒక మార్గదర్శి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉండి తీరుతారు. తల్లి కావచ్చు, తండ్రి కావచ్చు, మరెవ్వరైనా కావచ్చు. మా అమ్మగారు ఒక మాట అంటుండే వారు- "నీవు నేర్చిన విద్యలో చూపే ప్రతిభగానీ, పనిలో చూపే కార్యదక్షత గానీ, సేవలో అభిరుచిగానీ కేవలం నీవే కావు. తరతరాలుగా నీ పూర్వులలో బీజరూపంగా ఉన్నవే నీలో పరిణత దశలో కన్పిస్తాయి. అందుకే దత్తాత్రేయుల వారు విశ్వమంతా తన గురువులేనన్నారు. 'జగద్గురువు' అంటే జగతికి గురువని కాదు 'జగతినే తనకు గురువుగా భావించేవాడని అర్థం అన్నారు పరమగురువులు కంచి పీఠాధిపతులు. మనకంటూ ఎవరో ఒకరి మీద, వారి మాట మీద నమ్మకం కలుగుతుంది. వారినే మన గురువుగా భావిస్తాము. గురువును ఎంచుకొనేటప్పడే ఏ సందేహాలైనా, ప్రశ్నలైనా. ఒకసారి నిర్ణయించుకొన్న తరువాత-యిక ఆ విశ్వాసం చెదర కూడదు. సుస్థిర భావంతో నిలవాలి.

ఆ గురువు మనకొక మార్గం చూపిస్తారు. ఒకసారి ఆ త్రోవను నడవడం ప్రారంభమయ్యాక సందేహాలన్నిటినీ దూరం పెట్టాలి. మంచో,





చెడో-దగ్గరి దారో, చుట్టుదారో-గురువు చూపిన మార్గం అది. మన చాంచల్యానికి త్రోవచూపే మాయలు ఎన్నో మన చుట్టూ ముసురుకొంటాయి. కొంతదూరం నడిచాక-యింకేదో దారి ఆకర్షణీయంగా కన్పిస్తుంది. దగ్గరి దారిలాగా అనిపిస్తుంది. సులభంగా ప్రయాణానికి అనువుగా తోస్తుంది. మనసు అటు లాగుతుంది. కానీ, మన గురువు మన యోగ్యత, శీలస్వభావాలు బాగా గుర్తెరిగినవాడు గనుక మనకు తగిన మార్గాన్ని సూచిస్తారు. మన పట్ల కరుణ, ఒక బాధ్యత చూపించి అనువుకాని త్రోవలోకి మనను పోనివ్వరు. కానీ, మనంతట మనమే చాంచల్యానికి లోనైతే ఆయనేం చేస్తారు? శ్రీకృష్ణునంతటివాడే చెప్పటం నా ధర్మం అన్నాడే తప్ప శాసించలేదు. అందుచేత గురువిశ్వాసం తరువాత దృఢంగా పట్టుకోవలసింది ఆ గురువు చూపిన మార్గాన్నే. దానిలో సంశయాలకు తావే లేదు. శ్రీ రామకృష్ణ పరమహంస అంతిమ ఘడియలలో ఉన్నప్పడు వివేకానందులు ప్రక్కనే ఉన్నారు. 'వీరు యింత కాలం చెప్తున్నట్లు ఈయన నిజంగా రాముడూ, కృష్ణుడేనా?' ఒక సందేహం మెదిలింది ఆయన మనసులో. వెంటనే పరమహంస కళ్లు తెరిచి 'అవును, నిజమే!' అన్నారు. అయితే గురువు వెళ్లిపోయాక ఆయన చూపిన మార్గంలో అచంచలంగా నిలబడి, ఆయన బోధలన్నిటినీ సాకారం చేసారు వివేకానందులు. అటువంటి మార్గవిశ్వాసం ఉన్నవాడే సచ్ఛిష్యుడై, గురుఋణాన్ని తీర్చుకోగలుగుతాడు.

ఇక నాల్గవదీ, మూలరూపమైనదీ భగవద్విశ్వాసం. మనకు యోగ్యత నిచ్చినా, సద్గురువును ప్రసాదించినా, ఆయన చెప్పిన దారిలో నడవగలిగే ధీశక్తినిచ్చినా-భగవంతుడివ్వవలసిందే. అంచేత పరమాత్ముడున్నాడు-ఆయన నాకు తోడై నడుస్తాడు-అనే విశ్వాసం ఉండితీరాలి. "సర్వమున్న తని దివ్యకళామయుమంచు" భావించగల శక్తినివ్వగలిగేది ఆ పరమప్రభువే గనుక భగవద్విశ్వాసం లేని వారికి ముక్తి కలగటం గగన

కుసుమమే. మనం మరచినా ఆయన మనను మరువడు. అలాంటిది ఆయనపై విశ్వాసం నిలుపుకొంటే మరింత సన్నిహితం చేసుకోడా!

పైన చెప్పకొన్న చతుర్విధ విశ్వాసాలూ విడివిడిగా కన్పిస్తున్నప్పటికీ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. తన మీద తనకు నమ్మకం లేనివాడు దేన్నీ సాధించలేడు. అది అమితమైపోయి అహంకారం దరిజేర కుండా మార్గదర్శకత్వం చేయగలవాడు గురువు. ఆయన మనను గుర్తించి మనకు చూపే మార్గమే మనకు తారకం. ఈ లోకపు మాయా వాగురనుండీ దాటించగలది గురువే. పరమాత్మను చూపించగల ఆ శక్తి ఇదీ అని నిర్వచించడమే గాక నిర్వాణమార్గం చూపగలవాడు గురువు. కడపటి లక్ష్యం భగవంతుడు. అంచేత మిత్రులారా, విశ్వసిద్దాం-తరిద్దాం.

⁂

# శక్తి తరంగాలు

**- మాతా శుకవాణి**

సూర్యకాంతి అన్నింటి మీదా ఒకే రకంగా ప్రసరిస్తుంది. అది నీటి ఉపరితలం మీదనో, ఏ అద్దం మీదనో, నున్నని కొన్ని రకాల లోహవస్తువుల మీదనో పడినప్పడు అద్భుతంగా ప్రతిఫలించి కాంతులు చిమ్ముతుంది. భగవచ్ఛక్తి కూడా అంతే. చరాచర సృష్టి అంతటి మీదా ఒకేలాగా ప్రసరిస్తుంది. పవిత్రులై, సాధకులైన వారి స్వచ్ఛ హృదయాలు ఆ శక్తిని స్వీకరించి పదుగురికీ పంచగలుగుతాయి. అలా కాని వారి హృదయాలు ఆ శక్తిని తీసుకోలేవు.

మహనీయులైనవారు గతించిపోయినప్పటికీ వారి శక్తి తరంగాలు అక్కడి వాతావరణంలో పర్యాప్తమయ్యే ఉంటాయి. వారు నడయాడిన చోట, నిద్రించిన చోట, ఉపదేశాలిచ్చిన చోట, సమాధి అయినచోట,





అణువణువునా వారి శక్తి నిక్షిప్తమయ్యే ఉంటుంది. ఆ శక్తి వారు సాధించిన భగవచ్ఛక్తితో కలిసి ఉంటుంది. అంటే-ఆ రకంగా ఆ మహనీయులు కూడా శాశ్వతత్వం సంతరించుకుంటారన్నమాట! పృథ్వీతలం ఉన్నంతవరకూ కూడా వారి శక్తి నిలిచే ఉంటుంది. అందుకే

'నారాయణ సమారంభాం వ్యాస శంకర మధ్యమాం,

అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్" - అన్న శ్లోకంలో అనాదిపురుషుడై ఆది గురువైన పరమాత్మునితో ప్రారంభించి, మధ్య తరాలలోని మహనీయులను స్మరించి-అప్పడు మన గురువుకు నమస్కరిస్తాము. ఆ విధంగా చేసినపుడు - ఆయా మహాత్ముల శక్తి తరంగాలను రేఖామాత్రంగానైనా మనం స్పృశించి తరించగలం. దాని కోసమే పెద్దలు పుణ్యక్షేత్రాలను, తీర్థాలను సేవించమని చెప్పారు. అనేకానేక మంది ఋషులు, యోగులు, సాధు సన్యాసులు, సత్పురుషులు ఆయా ప్రాంతాలలో నడయాడి ఉంటారు గనుక క్షేత్రశక్తితోపాటు వారి శక్తి కూడా మనం పొందవచ్చు. అయితే వాటిని స్వీకరించే భావన మనకు ఉన్నపుడే అలా చెయ్యగలం. అంచేత యాత్రలకు వెళ్లినపుడు యీ విషయాలు జ్ఞాపకం ఉంచుకోవాలి.

మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి సమాధి, షిర్డీలో సాయినాథుల వారి సమాధి హారతివేళ తాకితే ప్రకంపనలు వస్తాయని చెప్తారు. సాయి సమాధిదైతే గురుదేవులు శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీ వారికి ప్రత్యక్షానుభవమే. వెంకయ్యస్వామి, చిన్నమ్మయోగిని, పిచ్చమ్మగారి వంటి మహా సాధకుల సమాధులు కూడా గొప్ప ప్రభావవంతమైనవి. ఇంకా ఎన్నో యిలాంటివి ఉండి ఉండవచ్చు. అలాంటి వాటి ఎదుట కూర్చొని ధ్యానం చేసినపుడు మనకెంతో మేలు కలుగుతుంది. అలాంటి మేలు భక్తులకు కలిగించే ఉద్దేశ్యంతోనే పరమపూజ్య గురుదేవులు శాశ్వతంగా శయనించిన 'జ్ఞానధామం' దగ్గర ఒక ధ్యానమందిర నిర్మాణం రూపుదిద్దుకొంటున్నది. శుభమ్.

# జ్ఞానధామం

ప్రియ సాయి భక్తులారా,

పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు సమాధి చెందినచోట **'జ్ఞానధామం'** పేరిట ఒక ధ్యాన మందిరం (నిశ్శబ్ద) సాధనకు అనువుగా నిర్మించాలని సంకల్పించారు సాయీశ్వరుల ఆజ్ఞతో శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్‌వారు. దీనికి కొలతలు 50 × 30 అడుగులుగా అనుకొన్నారు. దీనికి నిర్మాణపు ఖర్చు-గురుదేవుల పాలరాతి విగ్రహంతోసహా సుమారు రు.35,00,000/-లుగా అంచనా వేయబడింది ప్రస్తుతం.

సహృదయులైన గురుదేవులకు, ఆశ్రమానికీ అభిమానులు, శిష్యులు, సాధకులు ఈ మందిర నిర్మాణానికై తరలిరండి. ధన, వస్తు రూపాలలో ఎలాగైనా మీ సేవాహస్తం చాపవచ్చు. **విరాళాలకు 80జి రాయితీ లభిస్తుంది కూడా. (భవన నిర్మాణానికి శంకుస్థాపన అక్టోబరు 22 విజయదశమి నాటి ఉదయం జరిగింది.) నిర్మాణం పూర్తయ్యే నాటికి తయారై రావాలంటే గురుదేవుల పాలరాతి విగ్రహానికి ఇప్పుడే ఆర్డరివ్వవలసి ఉంటుంది.** కనుక మిత్రులారా, మీమీ సహకారం త్వరలో అందించే ప్రయత్నం చేసి శ్రీ గురుదేవుల, సాయినాథుల ఆశీస్సులు అందుకోగలందులకై ఆహ్వానిస్తున్నాం.

**ఫోన్స్ : 9440413455**
**9848133565**

**ధర్మాధికారి,**
**సాయిధామం.**

## సంస్మరణిక

మిత్రులారా,

గురుదేవుల పేరిట ఒక సంస్మరణిక తేవాలని ఒక సంకల్పం కలిగింది. మీకు వారితో పరిచయం, అనుబంధం, అనుభవాలు, మీకు కలిగిన మేళ్లు వగైరాలను అక్షరబద్ధం చేసి పంపితే-వాటిని సంస్మరణికలో చేరుస్తాము. సాయివాణిలోనైనా ప్రచురిస్తాము. అచ్చులో రెండు పేజీలు (ఎ4 సైజులో 3 వ్రాత పేజీలు) మించకుండా ఉండేలాగున వ్రాసి పంపగలరు. రచనలు సాయివాణి చిరునామాకు నవంబరు 15వ తేదీ లోపల చేరేలాగా పంపగలరు లేదా 'E-mail : saidhamam.ram@gmail.com, saidhamam.seva @ gmail.com' అన్న ఈ-మెయిల్‌కు కూడా పంపవచ్చు.

**- ప్రధాన సంపాదకులు, సాయివాణి**





# సన్న్యాసిలో ....

**- మాతా శుకవాణి**

భారతీయ సనాతన ధర్మ శాస్త్రాల ప్రకారం మనిషి నాలుగు రకాల ఆశ్రమాలు అనుభవించాలి. తొలిదశ బ్రహ్మచర్యం- రెండవది గార్హస్థం- మూడవది వానప్రస్థం-కడపటిది సన్న్యాసం. ఇవి విడివిడిగా అనుభవిస్తామని మనం అనుకొంటాం. బ్రహ్మచర్యంలో విద్యాభ్యసనం, గార్హస్థంలో సంసార జీవనం-వానప్రస్థంలో తిరిగి బ్రహ్మచర్యంలో నేర్చిన ధర్మబోధను తిరిగి మననం చేసుకొని, ఆత్మనిగ్రహం కోసం వనవాసంతో (లేదా ఆశ్రమ వాసంతో) గడపటం-చివరిగా సన్న్యసించి ధర్మబోధ చేస్తూ ముక్తి పథంలోకి సమాజాన్ని నడిపిస్తూ ఉండటం.

అయితే యివి విడివిడిగా కనిస్తాయి గానీ, ఏ ఒక్కటీ విడిగా లేవని పిస్తుంది. బ్రహ్మచారిగా గురుసేవ, నిరంతరం బ్రహ్మ యందు చరించటం, ధర్మసూత్రాలు నేర్వడం, విజ్ఞాన సంగ్రహం చెయ్యడం, ఇవన్నీ ఉంటాయి. అయితే యీ బ్రహ్మయందు చరించడమనేది నిరంతర సాధనగా ఉండాలి. అలాగే ధర్మసూత్రాలు జీవితమంతా మననం చేసుకుంటూనే ఉండాలి. గృహస్థ జీవనంలో కూడా నిరంతరం ధర్మాచరణ తప్పరాదు గదా! నియమపూర్వకంగా-అది కూడా స్వపత్నితోనే గార్హస్థం నెరపడం, ఎప్పటికప్పడు త్యాగ(సన్యాస) బుద్ధితో సంచరించడం తప్పనిసరే. వానప్రస్థులలో ఉండే అధ్యయనం, జ్ఞానతృష్ణ కొంతైనా గృహస్థులోనూ ఉండాలి.

అన్నింటికంటే మించినది సన్న్యాసం. ఇందులో పై మూడు ఆశ్రమాలలోని ఉత్తమ లక్షణాలు సమ్మిళితమై పరాకాష్ఠకు చెందుతాయి. బ్రహ్మచర్యంలోని నిష్ఠ, గృహస్థ ధర్మంలోని ప్రేమభావన సన్న్యాసిలోనూ ఉంటాయి. తన కుటుంబం కోసం శ్రమించిన తత్వం విశ్వమంతా నా కుటుంబమే అన్న విశాలభావనగా రూపొంది, వారికొరకు శ్రమించాలన్న

తపనగా మారుతుంది సన్న్యాసిలో. తన వారి కోసం గృహస్థు తన ఆనందాన్ని త్యాగం చేసినట్లే సన్న్యాసి లోకం కోసం తన స్వత్వాన్ని త్యాగం చేస్తాడు. ఇక జ్ఞాన తృష్ణ, అధ్యయనం అన్నవి అలవోకగా సన్న్యాసికి రక్త గతమైపోయేవే. ఈ విధంగా జీవితంలోని శక్తులన్నింటినీ సమ్యగ్రూపంలో (పరిపూర్ణ రూపం) న్యసించి ఉంచుకోగలడు గనుకనే ఆయన సన్న్యాసి అవుతాడు. కేవలం ముక్కు మూసి జపమో, తపమో చేసుకోవడం, ఆత్మ ముక్తికోసం సాధన చేసుకుంటూ ఉండటం మాత్రమే సన్న్యాసి లక్షణం కాదు. తాను బల్లకట్టుగా ఉండి పదుగురిని రేవు దాటించగలవాడే సన్న్యాసి. ధర్మరక్షణ కోసం తనను ఆహుతి చేసుకోవడానికైనా సిద్ధపడే వాడే సన్న్యాసి. భారత స్వాతంత్ర్య చరిత్రలో సంతాల్ పోరాటం పేరిట జరిగిన సంత్ పురుషుల పోరాటమే దీనికి తార్కాణం. కౌరవ పాండవ యుద్ధంలో ధర్మపక్షాన నిలచిన వ్యాసుడే యిందుకుదాహరణ. ఆ విషయాన్ని మరచి ప్రస్తుతం దేశం ఉన్న దారుణపరిస్థితులలో ఎవరి కుంపటి వారిదిగా ఆచార్య స్థానంలో ఉన్న సాధుసన్న్యాసులు సంచరించడం తగనైన పని కాదేమో! తాము నేర్చిన సమస్త జ్ఞానాలను పణంగా పెట్టి, ప్రాచీన ధార్మిక పునరుజ్జీవనానికి నడుం కట్టడం అత్యంత అవశ్యకమేమో - ఆలోచించండి.

అస్మద్గురుదేవులు, పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు సాధు సభలకు వెళ్లినా, తాము సభలు నిర్వహించినా, ఎవరైనా సాధు సత్పురుషులను కలిసినా పదేపదే ఘంటాపథంగా ఒకే విషయం ఇలా చెప్పుండేవారు - "సనాతన ధర్మం రక్షించుకోవటం అంటే కేవలం జపతపాలు, యజ్ఞయాగాలు నిర్వహించటం మాత్రమే కాదు. ధర్మాన్ని పోగొట్టుకొన్న దేశం ఉన్నా ఒక్కటే - నశించిపోయినా ఒక్కటే. దేశాన్ని పోగొట్టుకున్న చోట మన ధర్మాన్ని నిలుపుకోలేము. అందుచేత మీ చెంతకు వచ్చే శిష్యులందరికీ తిరుమంత్రంలాగా బోధించండి. "దేశాన్ని రక్షించండి- ధర్మాన్ని పాటించండి" అని. వారి పవిత్ర స్మృతికి అంజలిస్తూ హిందువైన ప్రతి వాడికీ యీ సందేశం అందాలని ఆకాంక్షిస్తున్నాను.





# శ్రీ రామా !

~ పరమ గురువులు స్వర్గీయ శ్రీ చిల్లర మాణిక్యరాయ శర్మ గారు

1. దశరథ తనయా, నేనీ వశమందున జేరినాడ వదలక నిక నా దశమార్చి కావజాలవె, నిశియు బవల్ కొల్తు నెపుడు నిన్నిదె రామా!
2. ధీరోదారుడవంచు నపార దయామృతము జిల్కఁబరగంగా నే కారణమున రాకుంటివి? నేరను నీ భక్తి జేయ నిజముగ రామా!
3. రామా రామాయని, నీ నామంబును రేయిబవలు నా నాలుకపై వేమారు నాడుచుండగ నేమాత్రంబైన వినవిదేమి రామా!
4. నీ పాదమందు భక్తిని నా పాపమదేమొగాని నాకీయవు, నే నేపాటివాడ నీ దయ నాపై రానిమ్ము వే నయముగ రామా!
5. పామరుడ నగుట నన్నిక నోమంగా దిక్కటంచు నోరారంగా నేమముతో నినుగొలిచెద సామజ వరదాయటంచు సతతము రామా!
6. కోరినవారల పెక్కగు కోరికల్ దీర్చి, నాదు గోడు వినకన్ దీరునె ననుగావక నో మారజనకనింక మహిలో రామా!
7. దూరంబని నీవెంచక రారా నాయొద్దకిపుడు రామా, యిక నా ధారంబు నాకు నీవే, పోరాములు లేక నన్ను బ్రోవవె రామా!
8. కోపంబదేలర నాపై, నీ పాదరజంబు నాదు నెత్తిన నిడి వే కాపాడ రమ్ము! నీవే నా పాలిటి దైవమంచు నమ్మితి రామా!
9. నోరారగ నిను బిలిచెద, రారా నా యొద్దకిపుడు రామా, యీ సం సారభరంబును బాపగఁగోరెద నిను సంతతంబు కూరిమి రామా!
10. దండకవనమున మెండుగ నుండిన రక్కసుల నీ సహోదరు తోడన్ చెండినవాడవు, నీ కైదండను నాకిమ్ము వేగమింకను రామా!
11. ఇలపై బుట్టినవారలు తలపున నినుజేర్చగానె తప్పక వారిన్ జలమూని రక్షసేతువు, కలడే నీ కంటె వేరు ఘనుడిల రామా!
12. ఏ రీతిగనైనను నా భారంబును నీవుగొని యపారకృపన్ నీ వారలలో నను జేర్చుము, కోరెద నీ పాదములను కూరిమి రామా!

# పంచామృతం

**- రాంబాబు**

'మావాడు పాలు తాగడండీ! మా అమ్మాయికి బలవంతంగా పెరుగు వేస్తే వాంతి చేసుకొంటుంది, నెయ్యి మేమెప్పడూ తినం' యిలాటి సూక్తాలు భారతదేశంలో అప్పడప్పడూ వినిపిస్తుంటాయి. గోవులో సకల దేవతలూ నెలకొని ఉంటారని నమ్మే దేశం మనది. గోమూత్రం, గోవు పేడతో సహా పవిత్రమూ, ఆరోగ్యకరమూనని విశ్వసిస్తాం మనం. ఇది కేవలం విశ్వాసమే కాదు-శాస్త్రీయంగా ఋజువైన విషయం కూడా. అలాటి గోమాత క్షీరాన్ని దూరం పెట్టేస్తున్నామంటే అర్థం ఏమిటి? అమృతాన్ని దూరం చేసుకొంటున్నామన్న మాట. పాలను తోడుపెడితే వచ్చేది పెరుగు. దాన్ని చిలికితే వెన్న-అది కరిగితే నెయ్యి. ఇవన్నీ ఆవు పొదుగులోంచీ వచ్చేవే. "అరవై రుచులూ ఆవు చన్నుల్లో ఉంటాయి" అని తెలుగునాట సామెత ఉంది. అంటే క్షీరాదికాలు అత్యంత రుచికరాలని అర్థం. నేతిమిఠాయిల కున్న విలువ మనకు తెలిసినదే. వెన్న రుచి గురించి శ్రీకృష్ణుడిని అడగాల్సిందే. ఇక పాలంటారా-ఏ దేశంలో, ఏ జాతిలో, ఏ శిశువుకైనా తొలి ఆహారం అదే గదా!

వెన్న, నెయ్యి మేధస్సును పెంచుతాయని యుగయుగాలనాటి శాస్త్ర నిర్ణయం. కృష్ణుడి బుద్ధే యిందుకు నిదర్శనం. నెయ్యి ఎక్కువగా వాడే మనుష్యులు బుద్ధి బలంలో మిగిలిన వారికన్నా పదునుగా ఉండటం మనకు తెలుసు. నేతితో చేసే యజ్ఞ, హోమ ధూమాలు పరిసరాలన్నిటినీ పవిత్రం చేస్తాయన్నది కూడా శాస్త్ర ప్రమాణమే. పెరుగు చలువ చేసి, శరీరాంతర్గతంగా మేలు చేసే బేక్టీరియాని పెంచుతుందన్నది వైద్యశాస్త్రం. అలా ఎన్నో మేళ్లు చేసే క్షీరం-ముఖ్యంగా గోక్షీరం, దధి, ఆజ్యం-యీ మూడూ అమృతాలు. వీటిని తిరస్కరించటం అంటే-ఎంత తెలివితక్కువ!





ఇక - పంచామృతంలో నాల్గవది తేనె. ఇది ప్రపంచంలోని అత్యంత సహజాహారాలలో ఒకటి. పువ్వుపువ్వునా ఉన్న మకరందాన్ని చుక్కచుక్కగా సంగ్రహించి-తేనెటీగలు చేసిన సంచయాన్ని మనం దొంగిలించి ఆ మాధుర్యాన్ని తేనెగా మనం ఆనందిస్తాం. గుండెకు బలాన్నీ, రక్తశుద్ధినీ, నాడులకు, నరాలకు శక్తినీ యిస్తుంది తేనె. శ్వాసకోశంలో వచ్చే యిబ్బందులకు కూడా యిది మంచి ఔషధం. పక్షవాతం వంటి భీకరవ్యాధులు దరిజేరకుండా కాపాడుతుంది. అందుచేత యిదీ అమృతమే అయింది.

చివరిది చక్కెర. నిజానికి చెరుకురసం కలపాలట పంచామృతంలో. అది అన్నివేళలా అందుబాటులో ఉండదు గనుక చెరుకురసంతో తయారయ్యే చక్కెర కలుపుతున్నారు. కొంచెం ఎక్కువ ద్రవరూపంలోకి తేవడానికి కొందరు కొబ్బరినీళ్లు కూడా చేరుస్తారు. ఇలా ఐదు అమృత సమమైన వస్తువులతో కలిసిన పంచామృతం అత్యద్భుతమైన ఫలితాల నిస్తుంది గనుక హిందూ పూజలలో ఒక ప్రధాన వస్తువైంది. అంచేత-మాకు పాలు పడవు, పెరుగిష్టం లేదు-అంటూ దాన్ని దూరం చేసుకోకండి.

ఇక్కడ ఇంకో ప్రధాన విషయం కూడా గుర్తుంచుకోవాలి. "పంచామృతంలో నేతి వంతు చాలా తక్కువగా - ఒక గ్లాసు పంచామృతానికి ఒక్క పావుచెంచా నెయ్యి మాత్రమే కలపాలి. ఆ మితి మించరాదు" అన్నారు. ఆయుర్వేద వేత్తలు-గుర్తుంచుకోండి.

# జ్ఞానుల తత్త్వం

**- శ్రీ రామకృష్ణ కథామృతం నుండి**

కుమ్మరివాళ్లు కుండలు ఎండబెడతారు. వాటిలో కాల్చిన కుండలు, కాలని కుండలూ వుండటం గమనించావా? ఆవులు మొదలైనవి ఒక్కొక్కప్పడు వాటిని త్రొక్కివేస్తాయి. అప్పడు కొన్ని కుండలు పగిలి పోతాయి. కాల్చిన కుండలు పగిలితే వాటి పెంకులను ఏరి, కుమ్మరి అవతల

పారవేస్తాడు. వాటితో యింక పనిలేదు. పగిలిన పచ్చికుండలను ప్రోగు చేసుకొని మట్టి ముద్దచేసి కుమ్మరి సారెలో పెట్టి మళ్లా కుండలు తయారు చేస్తాడు. అందుకే భగవద్దర్శనం కానంతవరకూ కుమ్మరివాడి చేతిలో పడాల్సిందే. అంటే ప్రపంచంలో మళ్లామళ్లా పుట్టాల్సిందే సుమా!

ఉప్పుడు వడ్లు నాటితే మొలుస్తాయా? అలాగే జ్ఞానాగ్నితో ఉడికిన జీవి ద్వారా సృష్టి జరగదు. అతడు ముక్తుడైపోతాడు.

పురాణాలలో భగవంతుడు భక్తుడు వేరువేరని చెప్పబడింది. శరీరం ఒక చిన్న పళ్లెం లాంటిది. ఆ శరీరమనే పళ్లెంలో మనోబుద్ధి, అహంకారాలనే నీరు నింపబడింది. బ్రహ్మము సూర్యుడిలాంటివాడు. అతడే ఆ నీళ్లలో ప్రతిబింబిస్తున్నాడు. అందుకే భక్తుడు భగవంతుడి రూపాన్ని దర్శించ గలుగుతున్నాడు.

వేదాంతాన్ని అనుసరించి బ్రహ్మమే సత్య వస్తువు-మిగిలినదంతా మాయ. అహమనే కట్ట సచ్చిదానంద సాగరం మధ్యలో పడి ఉంది. (మాస్టరుతో) నువ్వు దీన్ని బాగా విను. 'అహం' అనే కట్టను తీసేస్తే ఒకే సచ్చిదానంద సాగరం సుమా! ఈ అహమనే కట్ట వున్నందువల్లే రెండు భాగాలుగా కనపడుతుంది. ఈవైపు ఒక భాగం-ఆ వైపు ఒక భాగమని పిస్తుంది. బ్రహ్మజ్ఞానం కలిగితే సమాధి స్థితి పొందుతాడు. అటువంటప్పుడు యీ అహం పూర్తిగా తుడిచివేయబడుతుంది. కానీ, లోకశిక్షణార్థమే శంకరులు విద్య అనే అహాన్ని వుంచుకొన్నారు. (ప్రాణ కృష్ణుడితో) కాని జ్ఞాని లక్షణాలు ఉన్నాయి. నేను జ్ఞానినయ్యానని కొందరు అనుకొంటారు. జ్ఞాని లక్షణాలేవి? జ్ఞాని ఎవ్వరికీ చెడుపు చెయ్యలేడు. అతని బుద్ధి చిన్నపిల్లల స్వభావం పోలి వుంటుంది. ఇనుప కత్తి స్పర్శవేదికి తగిలితే అది బంగారమవుతుంది. ఇక బంగారపు కత్తితో హత్యలు జరగజాలవు. కేవలం బైటికి, కోపం వున్నట్లు, అహంకారమున్నట్లు కనబడినాగానీ





యథార్థమైన జ్ఞానులకు యిలాంటివి ఉండనే ఉండవు. కాలిపోయిన తాడును దూరం నుంచి చూస్తే, ఒక మంచిత్రాడు పడివున్నట్లు కనబడుతుంది. అలాగే అహంకారం, క్రోధం కేవలం ఆకారాలు మాత్రమే. కాని యథార్థమైన క్రోధం కాని, అహం కారంకాని జ్ఞానిలో ఉండవు.

చిన్నపిల్లలకు దేని మీదా ఆసక్తి ఉండదు. ఇసుకతో ఇళ్ళు కడతారు. ఎవరైనా చెయ్యి పెడితే పడిపోతుందని గొంతు చించుకొని చిందులు త్రొక్కుతూ ఏడ్పు మొదలుపెడతారు. కొంతసేపయ్యాక తామే దాన్ని పడగొడతారు. తమ చొక్కా ఎవరైనా అడిగితే 'మా నాన్న కొని యిచ్చాడు, నేనివ్వను' అంటూ ఎవరైనా ఒక బొమ్మ కొని యిస్తే అంతా మరిచిపోతారు. చొక్కా పారేసి బొమ్మను తీసుకొనిపోతారు.

జ్ఞానుల లక్షణాలన్నీ యిలాంటివే సుమా! ఇంట్లో అన్ని రకాలైన భోగైశ్వరాలు, కుర్చీలు, బల్లలు, సోఫాలు, బండ్లు, సవార్లు అన్నీ ఉంటాయి. అన్నింటిని వదిలిపెట్టి కాశీకి పోతాడు. వేదాంత మతానుసారం జాగ్రదవస్థ కూడా మిథ్యే.

కట్టెలు కొట్టుకొని జీవించేవాడొకడు మంచి నిద్రపోతుంటే వేరొకడు వచ్చి నిద్రలేపాడు. నిద్రపోయేవాడు కోపంతో లేచి, 'నా నిద్ర ఎందుకు పాడు చేశావు? నేను రాజయ్యాను. ఏడుగురు కొడుకులున్నారు. అందరూ మంచి తెలివిగలిగి అస్త్రవిద్యలో ఆరితేరారు. సింహాసనం మీద కూర్చొని రాజ్యాన్నేలుతున్నాను. ఇలాంటి నా సుఖసంసారాన్ని ఎందుకు పోగొట్టావు?, అని అడిగాడు. అప్పుడతడు 'అది ఒక కల బాబూ! అందులో ఏముంది?' అన్నాడు. దానికి కట్టెలు కొట్టేవాడు 'ఛీ! యింకా నీకు అర్థం కాలేదా? నేను కట్టెలు కొట్టుకొని బ్రతకటం ఎంత సత్యమో, కలలో రాజుగా జీవించటం కూడా అంత సత్యమే! నా కట్టెలమ్ముకొనే బ్రతుకు యథార్థమైతే-కలలో రాజవటం కూడా యథార్థమే" - అన్నాడు.

ఓం శ్రీ సాయిరాం



# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

20-02-1912

మేము కాకడహారతికి వెళ్లాము. సాయిసాహెబ్ ఒక్క మాటైనా పలక్కుండా చావడి నుండి మసీదుకు వచ్చారు - “అల్లామాలిక్” అని తప్ప మరేమీ అనలేదు. ప్రార్థన తరువాత బాపూసాహెబ్, నేను, ఉపాసనీ, లక్ష్మీబాయి కౌజల్గీ పంచదశి చదువుకొన్నాము. సాయీసాహెబ్ నడక నుండి తిరిగి మసీదుకు వచ్చాక ఆయన మసీదును పునర్నిర్మాణం చేస్తే బాగుంటుందన్న కోరిక వెలిబుచ్చారు. దానికి సరిపడా డబ్బు ఉన్నదని ఆయన దాన్ని గురించే మాట్లాడారు. కొందరు బరోడా స్త్రీలు, షర్కే అనే కుటుంబంవారు మధ్యాహ్న హారతికి వచ్చారు. అది మామూలుగా నడిచిపోయింది. రాధాకృష్ణమాయి కొంగగుడ్డ కొన్ని సాయిబాబా కూర్చొనే చోట వేళ్లాడగట్టింది. బాబా అవి తీసి విసిరిపారేసారు. మేము పంచదశి చదువు కున్నాం సాయంత్రం. నేను మసీదుకు సాయంత్రం ఆరుగంటలకు వెళ్లాను. సాయీసాహెబ్ రెండు కథలు చెప్పారు. మొదటి కథ నాకు చాలా నచ్చిందిగానీ యిప్పుడు గుర్తు రావటం లేదు. మరో కథలో ఓ ముసలావిడ తన కొడుకుతో కలిసి జీవిస్తూ ఉంటుంది. అతను ఊళ్లో శవాలు మోసి, ఆ వచ్చిన డబ్బుతో బ్రతుకుతుంటాడు. అక్కడ ఒక రకపు ప్లేగు వ్యాధి వచ్చి, చాలామంది మరణించారు. ఇతనికి చాలా డబ్బు వచ్చింది. అల్లా అతని తల్లికి ఒకసారి కన్పించి, అతని వృత్తి వదులు కొమ్మని చెప్పాడు. ఆమె కొడుక్కి చెప్పినా వాడు పెడచెవిన పెట్టాడు-చనిపోయాడు. వృద్ధురాలు నూలు వడికి బ్రతకసాగింది. అల్లా ఆమెను తన భర్త బంధువుల యింటికి వెళ్లమన్నాడుగానీ ఆమె అందుకు యిష్టపడలేదు. ఒకరోజు కొందరు బ్రాహ్మణులు ఆమె యింటికి నూలు కొనడానికి వచ్చి, ఆ యింటి ఆనుపానులన్నీ చూచి ఆ రాత్రి యింట్లోకి చొరబడ్డారు. ఆమె ఒక దొంగతో గ్రామీణులు చూస్తే చంపేస్తారు-పారిపొమ్మని చెప్పింది. వాడలాగే చేసాడు. తరువాత ఆమె చనిపోయి ఆ దొంగకు కూతురుగా పుట్టింది. ఈ కథను నేను సరిగా అర్థం చేసుకున్నానని చెప్పలేను. మేము సాయిసాహెబ్ సాయంత్రం నడకకు వెళ్లినపుడు చూచాము. మళ్లీ రాత్రి చూచాము. వాడా హారతి తరువాత భీష్మ భాగవతం, దాసబోధ చదివాడు.




21-02-1912

నేను మామూలుగానే లేచాను. ప్రార్థన సమయంలో దేవాజీ - ఈయన్ని మేమంతా సాక్షాత్కారీ బువా అంటాం - చేసిన శబ్దానికి చెదిరిపోయింది మనసు. ఎలాగో నిగ్రహించుకొని ప్రార్థన ముగించాను. సాయిమహరాజు బయటికి వెళ్లటం చూచాము. తరువాత పంచదశి క్లాసు జరిగింది. దాని తరువాత మసీదుకు వెళ్లి బాబా దర్శనం చేసుకున్నాను. బరోడా నుంచీ వచ్చిన షిర్కేల ఆడవాళ్లు బాబా సేవలో ఉన్నారు. బొంబాయి నుంచీ ఒక నాట్యగత్తె వచ్చిందివ్వేళ. ఆమె మసీదులో రెండు పాటలు పాడింది. తాను బాలకృష్ణ బువా శిష్యురాలినని ఆమె చెప్పింది. బాబా ఆమె పాటలు విన్నారు. మధ్యాహ్నహారతి మామూలుగా నడిచింది. బాబా మంచి మూడ్‌లో ఉన్నారు. భోజనానంతరం కాస్సేపు పడుకొని లేచాను. తరువాత మామూలు సభ్యులతో మా పంచదశి క్లాసు నడిచింది. సూర్యాస్తమయవేళ బాబా నడకకు వెడుతున్నపుడు బాబాను దర్శించుకొన్నాను. వాడా హారతి తరువాత శేజారతికి వెళ్లాము. ఊరేగింపు, ఇతర ఏర్పాట్లు ఇవ్వేళ చాలా ఘనంగా ఉన్నాయి. భజన తాళాలతో వాటితో చక్కగా జరిగింది. బొంబాయి నాట్యగత్తె కొద్దిపాటలు పాడింది శేజారతి తరువాత. రాత్రి భీష్మ భాగవతం, దాసబోధ చదివాడు.

(సశేషం)

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

## 11వ అధ్యాయము

ఆ తరువాత సంవత్సరం గజాననులు బాలభావు ఇంట్లో దాస నవమి ఉత్సవాలకు బాలాపూర్ వచ్చారు. వారి వెంట భాస్కర్ పాటిల్, పీతాంబర్, గణు, జగదేవ్ మొదలైన వారు కూడా ఉన్నారు. ఉత్సవం చక్కగా నడిచింది కాని భాస్కర్ మీద ఓ ఉత్పాతం వచ్చి పడింది. ఓ పిచ్చికుక్క అతన్ని కరిచింది. అతని ఆత్మీయులంతా కంగారుపడ్డారు. ఎవరో డాక్టర్ కోసం వెళ్ళారు. కానీ, భాస్కర్ మాత్రం "నన్ను మహరాజ్ చెంతకు తీసుకువెళ్ళండి ఆయనే నన్ను కాపాడగలరు"-అని గోల పెట్టాడు అలాగే చేసారు. అంతా విని వారు నవ్వుతూ "శత్రుత్వం, ఋణం, హత్య వీటి దోషాలు ఎవ్వర్నీ వదలవు. సుఖ్‌లాల్ ఆవు తుంటరిది. ఎలాగో షేగాఁవ్‌లో బాగుపడింది. కానీ-అదే దుష్టత్వం యిక్కడొక కుక్కను పట్టుకున్నది. అది వీడిని కరిచింది. భాస్కర్ ఆ ఆవును బాగు చెయ్యమని నన్ను అడిగాడు. దాని పాలు పిండుకొని త్రాగవచ్చునన్న ఆశతో. పాలైతే త్రాగాడుగానీ తర్వాత వచ్చే మంచి చెడులు ఆలోచించలేదు. ఊఁ! ఏమయ్యా భాస్కర్! నిన్ను రక్షించమంటావా? కుక్కకాటు అన్నది పైకి కనిపించే కారణం మాత్రమే. నిజానికి నీకు ఆయువు తీరిపోయింది. నీకింకా బ్రతకాలని ఉంటే నీ ఆయువున్నేను పొడిగించవచ్చు. కానీ, అది తాత్కాలికం మాత్రమే. నీకేం కావాలో చెప్ప" అన్నారు.

"అయ్యా, నేను మూఢుడిని. నాకేమీ తెలియదు. నీవు నా తల్లివి. బిడ్డకు ఏంకావాలో తల్లికే తెలుస్తుంది. నీవేం చేస్తావో చెయ్యి" అన్నాడు భాస్కర్.





గజాననులకు అతడు సత్యమే చెప్తున్నాడని తెలుసు గనుక ఆయన నవ్వారు. ప్రక్కనున్న వాళ్లు కూడా భాస్కర్‌ను రక్షించమని ప్రార్థించారు. అప్పుడు మహరాజు యిలా అన్నారు. "జననం, మరణం రెండూ భ్రాంతులే, ఎవరూ చావరు, ఎవరూ పుట్టరు బంధాలను విడిచిపెట్టాలి. మూడు రకాల కర్మలు ఉంటాయి, సంచితం, ప్రారబ్ధం, ఆగామి, గత జన్మల కర్మ సంచితం. ఇప్పడు అనుభవిస్తున్నది ప్రారబ్ధం. నీవు యిప్పడు చేసే దాని వలన ఫలితాన్ని పై జన్మలో అనుభవించాలి. గత జన్మలో చేసిన దాని ఫలితాన్ని యిప్పడు అనుభవిస్తున్నావు. జీవులు యీ కర్మలన్నింటినీ అనుభవించే తీరాలి. అలా జనన, మరణ చక్రం అనేకసార్లు తిరుగుతూ ఉంటుంది".

ఇది భాస్కర్‌కు చివరి జన్మ. అతనికి బకాయిలు ఏమీ లేవు. ఇక జనన మరణ చక్రం నుండి విముక్తుడవుతాడు. అందుచేత అతని జీవితాన్ని పొడిగించమని అడగకండి. ఇలాంటి భక్తులు చాలా అరుదుగా పుడతారు. ఇప్పడు అతనిని కరిచిన కుక్క గత జన్మ శత్రువు. అతడు దీని మీద పగ తీర్చుకోవాలంటే మరోజన్మ ఎత్తాలి. కనుక ఆ వైరం యిప్పడే సమసిపోవాలి. ఇతని కర్మ పాశాలన్నీ తెగిపోతున్నాయి. నేను ఒకే సహాయం చేయగలను, యితనిని మరో రెండు నెలలు బ్రతికించగలను, అది కూడా పిచ్చెక్కకుండా. ఇప్పడు నేను ఆ పనిని చేయకపోతే ఆ రెండు నెలల గురించి మళ్లీ పుట్టవలసి వస్తుంది".

బాలాభావు యిది విని చాలా సంతోషించాడు. "ఓ భాస్కర్, నీవు భాగ్యశాలి వయ్యా! నీ భక్తి సార్థకమయ్యింది. జనన మరణాల నుండి విముక్తుడవవుతున్నావు" అన్నాడు. ఆ తరువాత అందరు షేగాఁవ్ వెళ్ళిపోయారు. భాస్కర్ జరిగిందంతా తన వాళ్లకి చెప్పి "గజాననులు అద్భుతమైన రత్నమనీ ఆయనను జాగ్రత్తగా సేవించుకొమ్మనీ చెప్పాడు. అంతేకాక అలందిలో జ్ఞానేశ్వర్ మహరాజులాగా వెలిసారు గనుక, యిక్కడ

ఒక స్మారకచిహ్నాన్ని ఏర్పాటు చేద్దామన్నాడు. తనసాటి శిష్యులను, భక్తులను శేగాఁవ్‌కు పిలిపించుకున్నాడు భాస్కర్. ఇంకో రెండు నెలలు నేను మీతో ఉంటాను, మహారాజుకు స్మారకం నిర్మిస్తే ఆనందంగా వెళ్ళిపోతాను అని చెప్పాడు. అందరూ అందుకు అంగీకరించాడు.

మాఘ బహుళ త్రయోదశి వచ్చింది. గజాననులు త్రయంబకేశ్వరంలో జరిగే శివరాత్రి ఉత్సవానికి తీసుకువెళ్ళారు భాస్కర్ తదితర భక్తులను. అంతా గోదావరీ స్నానం, జ్యోతిర్లింగ దర్శనం చేసుకున్నారు. నీ పాదాలే నాకు గంగా, గోదావరి నీవే త్రయంబకేశ్వరుడవు నా పాలిటికి అన్న భాస్కరుడితో తీర్థశక్తిని తక్కువ చేయవద్దని చెప్పారు గజాననులు. అక్కడి నుండి కుశావర్తంలో శంకరుడిని దర్శించి నీలాంబిక, నివృత్తినాధులను దర్శించి, నాసిక్ వెళ్ళారు. అక్కడ కాలారాం దేవాలయం ముందర ఒక పెద్ద రావిచెట్టు ఉంది. గోపాల్‌దాస్ మహంతు అనేవారు గజాననులను చూచి మహదానందం పొందారు. మా అన్నగారు విదర్భ నుండి నన్ను చూడవచ్చారు" అని పొంగిపోయి తన శిష్యులతో అతిథులకు సత్కారాలు చేయించారు.

తరువాత గజాననులు ధుమాల్ ప్లీడరును చూచి కొద్దిరోజులు అయ్యాక షేగాఁవ్ వచ్చారు. శ్యాంసింగ్ అనే భక్తుడు గజాననులను అడ్‌గాఁవ్ రమ్మని అడిగితే శ్రీరామనవమి ఉత్సవాలలో వస్తానన్నారు. అలాగే అతను మళ్లీ వచ్చి తీసుకువెళ్లాడు. హనుమజ్జయంతి అయింది.

ఒకరోజు గజాననులు భాస్కర్‌ను నేలమీద పడేసి (అడ్‌గాఁవ్‌లోనే) అతని గుండె మీద కూర్చొని గట్టిగా కొట్టసాగారు. బాలాభావు మహారాజును భాస్కర్ మీద దయ చూపవలసిందిగా ప్రార్థించాడు. అప్పటికే భాస్కర్ ఎండదెబ్బ తిని ఉన్నాడని వేడుకొన్నాడు. భాస్కర్ బాలాభావును కల్పించుకోవద్దనీ, మహారాజు. ఇష్టం వచ్చినట్లు చేయనిమ్మనీ అన్నాడు. వారే తన ప్రభువనీ, ఆయన కొడితే తనకు బాధ కలగదనీ అన్నాడు.

**(సశేషం)**





# చదవండి–ఆలోచించండి

**– శ్రీ గురువాణి**

You have to stop worrying and the thing will come to you of its own accord. If you run after the shadow, it will run away from you. But when you face the sun and turn away from the shadow or give up the idea of catching it, it is blound to follow you.

Anxiety for a selfish thing is a partition which keeps you away from Him. Therefore let your anxiety be no anxiety to have desired objects.

నీవు ఆతురతను విడిచిపెట్టు, ఆరాటపడకు. ఏది నీదో అది దానంతటదే నీకు లభిస్తుంది. నీవు నీడను తరుముతూ పరుగెత్తావనుకో- అది నీకు అందకుండా పారిపోతుంది. నీవు సూర్యుడివైపు తిరిగావనుకో. నీడే నిన్ను అనుసరించటం ప్రారంభిస్తుంది. సూర్యుడంటే స్వయం ప్రకాశకుడైన పరమాత్ముడని భావం. నీవు పరమాత్మునికి వీపు చూపించి నడుస్తోంటే నీ నీడ-అంటే నీలోని అవలక్షణాలు పొడవై నీ చేతికి చిక్కకుండా పరుగులు తీస్తాయి. నీవే గనుక భగవంతునికి అభిముఖంగా నిలబడితే ఆ అవలక్షణాలన్నీ నీ వెనక్కుపోయి ఒదిగి ఉంటాయి. అంచేత సర్వదా భగవంతునివైపే చూస్తుండు.

స్వార్థం కోసం-ఐహిక వాంఛల కోసం నీవు పడే తపన నీకూ, పరమాత్మునికీ మధ్య అడ్డుగా నిలచి, నిన్ను ఆ తండ్రికి దూరం చేస్తుంది. అందువలన నీవు లౌకిక విషయాల కోసం ఆరాటపడటం మానివేసి ఆయన కోసమే తపించటం నేర్చుకో.

బాలవాణి

# తెనాలి రామలింగని తెలివి

- మంజుల

రామలింగ కవి శ్రీ కృష్ణ దేవరాయల ఆస్థాన కవి. అతడు తన తెలివి తేటలతో రాయలను నవ్విస్తూ, ఆనందింపజేస్తూ ఉండేవాడు. అతని పట్ల అసూయపడే వాళ్లందరినీ తన చురుకుదనంతో గెలుస్తూ ఉండటంతో రాయలు అతన్ని చాలా అభిమానించేవాడు. ఒక్కోసారి కృష్ణరాయల మీద కూడా తన హాస్యం విసురుతుండేవాడు రామలింగడు.

ఓసారి ఒక గుర్రాల వ్యాపారి వచ్చి, ఒక గుర్రాన్ని చూపించి, అలాంటి గుర్రాలు తన దగ్గర చాలా ఉన్నాయనీ, ప్రభువు వారికి అవసరమైతే తీసుకు వస్తాననీ అన్నాడు. రాయల వారికి ఆ గుర్రం చాలా నచ్చింది. అందుచేత ఐదు వేల బంగారు నాణేలు ఇచ్చి ఉన్న గుర్రాలన్నీ తెమ్మన్నాడు. వ్యాపారి నమస్కారాలు చేసి వెళ్లిపోయాడు.

మరునాడు రాజాస్థాన భవనం ముందు కూర్చొని తెనాలి రామలింగడు ఏదో వ్రాస్తున్నాడు - సభలోకి రాకుండా. రాయల వారు మేడ దిగి వస్తూ అది చూచాడు. ఆ వ్రాసే దానితో సహా సభలోకి రమ్మని కబురు పంపాడు రామలింగనికి. అతను వచ్చాక అడిగారు "ఏం వ్రాస్తున్నావు?" అని.

"నేను చెప్తే మీకు కోపం వస్తుంది మహాప్రభూ!" అన్నాడు రామలింగడు.

"నువ్వేదో వ్రాస్తే నాకెందుకు కోపం? అసలు అదేమిటో నన్ను చూడనివ్వు" అన్నాడు రాజు.

"మీకిది నచ్చదు మహారాజా! నా మీద కోప్పడతారు కూడా" అన్నాడు రామలింగడు వినయంగా.

రాయలు చిరునవ్వుతో చెయ్యి చాపితే యిక రామలింగనికి ఇవ్వక తప్పలేదు. రాయలకు అది చూస్తూనే కనుబొమలు ముడిపడ్డాయి. 'ఏమిటిది?' అడిగాడు.

"పైన వ్రాసాను ప్రభూ!"

"తెలివైన మూర్ఖులు అన్నావు. మరి నా పేరెందుకు మొదటే వ్రాసావు?" రాయలు తీవ్రంగా అడిగాడు.

"ఏ దేశం నుంచో ఎవరో వచ్చి తన దగ్గర గుర్రాలున్నాయంటే నమ్మేసి ఐదు వేల కఱుకుల్లాంటి నాణేలు ఇచ్చేసారు మరి! తమరు చాలా గొప్పవారే గానీ .... ఈ పని మాత్రం .... "

రాయల వారికి రామలింగని భావం అర్థమైంది. "అయితే ఆ వ్యాపారి రాడంటావు. ఒకవేళ వస్తేనో?" అన్నాడు ఆయన.

రామలింగడు చాలా గంభీరంగా చూస్తూ "అప్పుడు తమ పేరు తీసేసి, ఆ వ్యాపారి పేరు వ్రాస్తాను" అన్నాడు. రాయలవారు ఫక్కున నవ్వారు.

"భేష్! రామలింగా, నీ తెలివికి మెచ్చుకొంటున్నా. ఇవ్వేళే ఆ వ్యాపారి ఆచూకీ తీయడానికి చారులను పంపిస్తాను" అన్నారు. రామలింగడు "చిత్తం!" అన్నాడు నమస్కారం చేస్తూ.

మరోసారి ఒక నాట్యగత్తె కృష్ణరాయల ఆస్థానానికి వచ్చింది. ఆమెకు ఆరేడు భాషలు వచ్చునన్నది. తెలుగులో, కన్నడంలో, సంస్కృతంలో, తమిళంలో-ఎవరు ఏ భాషలో పలకరిస్తే ఆ భాషలో జవాబులిస్తోంది. ఏ భాష పాటలకైనా నాట్యం చేయగలుగుతున్నది. తన మాతృభాష ఏమిటో ఎవరైనా చెప్పగలిగితే వాళ్లకు దాస్యం చేస్తానని సవాలు కూడా విసిరింది. ఆ రాత్రి ఆమెకు విడిది చేయడానికి ఒక భవనం యిచ్చారు.

ప్రొద్దున్నే లేచి ఆ నాట్యగత్తె తోటలో విహరించసాగింది. రామలింగడు తోటమాలి వేషంలో ఆమె తిరుగుతున్నవైపే తిరుగుతూ ఏదో పనిచేస్తున్నట్లు నటిస్తున్నాడు. ఆమె చిన్న గొంతుతో ఏవేవో పాటలు పాడుకొంటున్నది. అవి అన్ని భాషలలోనూ ఉన్నాయి. అంచేత రామలింగనికేమీ అంతు పట్టలేదు. మెదలకుండా వెళ్లిపోయాడు అక్కడి నుండీ.

ఆ మధ్యాహ్నం రాజసభలో నాట్యకత్తె నాట్యం ఏర్పాటైంది. ఒక్కొక్కరు ఒక్కొక్క భాషలో పాటపాడుతోంటే ఆమె ఏమాత్రం తడబడకుండా భావాన్ని అనుసరించి నర్తిస్తోంది. నాట్యం కూడా అద్భుతంగా ఉంది. అంతలో ఒక నాట్యాచార్యుడు ప్రవేశించాడు సభలోకి. వస్తూనే ఆయన భరతనాట్యపు జతులు ఆలపించసాగాడు. అక్కడి వాద్యకారులు అతనికి సహకరిస్తున్నారు. ఆ నాట్యాచార్యుడు తాను కూడా పాదాలు కదుపుతూ ఆమెతోపాటే నర్తిస్తున్నాడు. జనమంతా వినోదిస్తున్నారు. హఠాత్తుగా నాట్యాచార్యుడు ఆమె కాలు గట్టిగా తొక్కాడు. ఆమె నొప్పి భరించలేక "అడి పావి, పాషండ, చండాల!" అని తిట్టింది. వెంటనే నాట్యాచార్యుడు తన తలమీది పాగా తీసివేస్తూ -

"అమ్మా, నీ మాతృభాష తమిళం. ఎవ్వరికైనా బాధలోనూ, దుఃఖంలోనూ చటుక్కున వచ్చేది మాతృభాషేగా!" అన్నాడు. రాయలవారు రామలింగడే నాట్యాచార్యుడని తెలిసికొని అతన్ని సాదరంగా గౌరవించి బహుమానమిచ్చాడు. నాట్యకత్తె అవమానంతో తలవంచుకొని తన త్రోవన తాను పోయింది. అలా చక్కని సమయస్ఫూర్తితో రాయలవారి ఆదరాభిమానాలు చూరగొనడమేగాక రాజ్యగౌరవాన్ని కూడా కాపాడుతుండేవాడు తెనాలి రామలింగడు.





# నిశ్శబ్ద ప్రేమ

- ద విజన్ ఆధారంగా

ఆ ఇంట్లో నేను రెండేళ్ళుగా పని చేస్తున్నాను. నాది పెద్ద సంసారం. వచ్చే జీతం ఒకపూట కడుపునిండా తినడానికీ, మరోపూట అర్ధాకలితో పడుకోవడానికీ మాత్రమే సరిపోతుంది. అందుచేత అప్పుడప్పుడు వంటమనిషి తెచ్చి చెత్తకుప్పలో పడేసే కవర్లు ఒక కంట చూస్తూ ఉంటాను. అందులో కాస్త ఎండిపోయిన కూరగాయలు, వడలిపోయిన పళ్లు, ఎండిపోయిన బ్రెడ్డు లాంటివి దొరుకుతుంటాయి మరి!

మా యజమాని ఓ చిత్రమైన మనిషి. నన్ను ఉద్యోగంలో పెట్టుకున్న రోజు అమ్మగారు మాట్లాడుతుంటే పక్కనే కూర్చున్నారు అంతే! అప్పటినుంచి యిప్పటివరకు యీ మూడేళ్ళలోనూ ఆయన కారు వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు నేనే గేటు తెరుస్తాను. వినయంగా నమస్కారం చెప్తాను. కానీ, ఒక్కరోజు కూడా ఆయన నన్ను పట్టించుకోనేలేదు. ఒకరోజు ఆయన వచ్చే సమయానికి భవనం బయట పనిమనిషి పడేసిన సంచుల్లో ఏమైనా దొరుకుతాయేమోనని వెతుకుతుండగా ఆయన నన్ను చూశారు. కోప్పడతారేమోనని అనుకున్నా. కాని యథాప్రకారంగా ఏమీ పట్టించుకోకుండానే వెళ్ళిపోయారు.

ఆ మర్నాడు నిన్నటిచోటే ఒక కాగితం సంచి కనపడింది. అది తీసి చూస్తే చాలా తాజాగా ఉన్న కూరగాయలు, కొద్దిగా పళ్ళు, ఒక పాలసీసా కూడా ఉన్నాయి. అది ఎక్కడినుండి వచ్చిందో నేను ఆలోచించలేదు. సంతోషంగా ఇంటికి తీసుకువెళ్ళాను. ఇక అక్కడి నుండి ప్రతిరోజు మంచి మంచి పదార్థాలతో, పళ్ళతో, ఒక్కొక్కసారి కొంచెం పిండివంటలతో సహా ఒక కవరు దొరుకుతుండేది. నా పిల్లలు కమ్మగా తిని సంతోషించేవారు. అలా ఆరేడు నెలలు గడిచిపోయాయి. హఠాత్తుగా మా యజమాని చనిపోయారు. కొన్నిరోజులు దుఃఖంతో, గందరగోళంతో నిండిపోయింది

ఆ భవనం. ఆ రోజుల్లోనే నాకూ కష్టాలు మొదలయ్యాయి. నాకు రోజూ దొరికే ఆహారపు సంచి యిప్పుడు దొరకడం లేదు. మా ఇంట్లో పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. ఈ మధ్య మంచి తిండి తిన్నారేమో మరీ గొడవ మొదలుపెట్టారు పిల్లలు. అలా రెండు నెలలు గడిచిపోయాయి.

ఓరోజు మా యజమానురాలి దగ్గరకు పోయాను. జీతం పెంచమని అడిగాను. ఆమె ఆశ్చర్యంగా చూస్తూ - "నీకు పనేమీ పెంచలేదే మేము! ఇన్నాళ్ళు సరిపోయిన జీతం యిప్పుడెందుకు సరిపోవడం లేదు?" అని అడిగింది. నేను నిజాయితీగా నాకు రోజూ దొరికిన సరుకుల సంచి గురించి వివరంగా చెప్పాను. నా యజమానురాలి కళ్ళ నుండి నీళ్లు బొటబొట కారసాగాయి. "ఎప్పుడాగిపోయాయి ఆ సంచులు?" అన్నది గద్గదమైన కంఠంతో.

"అయ్యగారు పోయినప్పటి నుంచీ" అన్నాను. అలా అంటుండగానే నా బుర్రలో తళుక్కుమన్నది-మా అయ్యగారే ఆ సంచులు పెట్టి ఉంటారు! నేను నమస్కారం చెప్తే పొరపాటునైనా ఎలాంటి స్పందన చూపించని ఆ పెద్దమనిషి నాకింత సాయం చేసారా! అమ్మగారు వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్నారు. నేను వెంటనే "అమ్మగారూ క్షమించండి. నాకు మీరేమీ జీతం పెంచొద్దు. సంతోషంగా మీ దగ్గరే పనిచేస్తాను" అన్నాను చేతులు జోడించి. ఆమె బలవంతంగా ఏడుపాపుకొని -

"మీ అయ్యగారు రోజూ ఏడు సంచుల్లో ఏవేవో నింపుకొని తీసుకు వెళ్ళి ఏడుగురికి సాయం చేస్తుండేవారు. ఎవరికో నాకు తెలీదు. అటుపైన ఆరుగురి ఆచూకీ తెలుసుకోగలిగాను. ఏడవవాడివి నువ్వని యిప్పుడు తెలిసింది" అన్నది.

ఆ తర్వాత ప్రతిరోజూ వాళ్ళబ్బాయి మా యింటికి వచ్చి ఆహారపదార్థాల సంచి యిచ్చి వెళ్ళడం మొదలుపెట్టాడు. నేను వినయంతో అందుకొని సంతోషంతో "థాంక్యూ" అనేవాణ్ణి. అతను సరిగ్గా వాళ్ళ నాన్నలాగే ఒక్కరోజైనా జవాబివ్వలేదు. ఒకరోజు నేను కాస్త గట్టిగా "థాంక్యూ సార్" అన్నాను. అతను ఆగి-నావైపు చూచి "మా నాన్నగారిలాగే నాక్కూడా బాగా





చెముడుంది. నువ్వు చెప్పింది వినపడకపోతే ఏమీ అనుకోకు" అన్నాడు. "ఓ భగవంతుడా, నన్ను క్షమించు! నేను మామూలు మనిషిని. ఇతరుల గురించి పూర్తిగా తెలియకుండానే నా కోణంలోనే అంచనాలు కట్టి నిర్ణయాలకు వచ్చేసే మామూలు మనిషిని. నాలో వివేకం కలిగించి, సరియైన త్రోవలో నడిపించు స్వామీ!" అని ప్రార్థించుకున్నాను. నాలో నేనే చెమర్చిన కళ్లతో.

## ఋభు గీత

- భాగవతం ఆధారంగా

ఋభు మహర్షికి శిష్యుడు నిదాఘుడు. ఋభు, నిదాఘుల నడుమ నడచిన ఒక సంఘటనకు 'ఋభు గీత' అని పేరు. త్రోవతప్పి సంచరిస్తున్న తన శిష్యునికి మార్గోపదేశం చేయడానికి ఋభువు చేసిన బోధే ఋభుగీత. నిదాఘుడిని గురువు అత్యంత కరుణతో ఆదరించేవారు. పరమాత్మ తప్ప యీ విశ్వంలో సత్య పదార్థమేదీ లేదని గురువు పదే పదే చెప్పినప్పటికీ నిదాఘుడు జ్ఞానమార్గంలోకి రాలేకపోయాడు. అతని మనసు పరాభక్తికి కాక వైధీ భక్తికే లొంగిపోయింది. ఆయన తన స్వగ్రామంలో ఆచార వ్యవహారాలు పాటించటంతోనూ, కొంత లౌకిక జీవనంతోనూ గడపసాగాడు. ఋభుడు అప్పడప్పుడూ తన శిష్యుడి దగ్గరకు వెళ్లి, అతని సాధన ఎలా ఉందో చూచి వచ్చేవాడు. ఒక్కొక్కసారి మారు రూపంలో కూడా వెడుతుండేవాడు.

అలాగే ఒకసారి ఆయన ఒక పల్లెటూరి పామరుడి వేషంలో నిదాఘునికి ఊరికి వచ్చాడు. ఆ సమయంలో శిష్యుడు నగరంలో జరుగుతున్న ఒక ఉత్సవాన్ని ఆనందంగా చూస్తున్నాడు. గురువు వెళ్లి శిష్యుడి ప్రక్కన నిలబడ్డాడు. అతడు ఈయనను గుర్తించలేదు.

"ఆ గోలంతా ఏమిటి బాబూ!" అని అడిగాడు ఋభువు.

"అడుగో రాజుగారు ఊరేగింపుగా వెడుతున్నారు గదా!"

"అలాగా! ఇంతకీ రాజెవడీ?" మళ్ళీ అడిగాడు గురువు.

"అడుగో-ఆ ఏనుగు మీద ఉన్న వారే రాజుగారు!"

"ఓహో-ఏనుగు, రాజు-ఇద్దరు కన్పిస్తున్నారు. ఇంతకీ అందులో రాజెవరు, ఏనుగెవరు?"

"ఇదుగో - నీకు కళ్లు సరిగా పనిచెయ్యవా? ఆ పైన ఉన్న వారు ప్రభువు. క్రింద ఉన్నది ఏనుగు. నీలాటి మొద్దుమొహంతో మాట్లాడటం నాదే తప్పు" విసుక్కున్నాడు నిదాఘుడు.

"నాలాంటి తెలివితక్కువ వాళ్ల మీద కోపం తెచ్చుకుంటే ఎలా బాబూ! ఇంతకీ రాజు, ఏనుగు ఇవి తెలిశాయిగానీ పైన, క్రింద అంటే ఏమిటో నాకు అర్థం కాలేదు" అన్నాడు ఋభువు అమాయకత ప్రదర్శిస్తూ.

"నువ్వు వంగు" అన్నాడు నిదాఘుడు కోపంగా.

ఋభువు వంగి నిలబడ్డాడు. శిష్యుడు ఛెంగున ఆయన వీపు మీద ఎక్కి కూర్చున్నాడు. "సరిగ్గా విను. నీవు క్రింద ఉన్నావు-నేను నీ మీద ఉన్నాను. ఇప్పటికైనా తెలిసిందా క్రిందంటే ఏమిటో, పైనంటే ఏమిటో!" హేళనగా అన్నాడు.

ఋభువు తలఊపి "బాగా అర్థమైంది. కానీ, నువ్వు-నేను అన్నావే! అవేమిటో అర్థం కాలేదు" అన్నాడు.

నిదాఘుడు వివరించబోయి ఆగిపోయాడు. మాయలోపడ్డాడేగానీ జ్ఞానం ఉన్నవాడే గనుక, నేను-నీవులను వేరు చేసి చూడటం కుదరదనీ, అందరిలోనూ ఒకే పరమాత్మ శక్తి విభిన్న రూపాలలో ఉంటుందనీ, వాటిని వేరుచేసి నామరూపాలతో గుర్తించటం మాయా ప్రభావమనీ, అంతర్లీనంగా ఉన్న దైవీశక్తిని గుర్తించడమే జ్ఞానానికి తొలి సాధనమనీ తెలిసిన అతని లోపలి శిష్యుడు మేల్కొన్నాడు. ఈ ప్రశ్న అడగగలిగినవాడు తన గురువుగాక వేరెవ్వరు? గభాల్న క్రిందకి దూకి గురువు పాదాల ముందర సాష్టాంగపడ్డాడు.

"స్వామీ! నాకు తెలిసింది. ఈ నశ్వర ప్రపంచంలో కంటికగుపించే పూజలు, వ్రతాలూ, తీర్థయాత్రలో మరే ఆచార వ్యవహారాల మీదనో





లగ్నమైన నా మనసును-సర్వజీవ స్వరూపుడిగా కన్పించినా నిజానికి నిరాకారుడైన పరమాత్మవైపు మరల్చడానికే తమరీ వేషం ధరించి వచ్చారు. నన్ను క్షమించి ఆశీర్వదించండి గురుదేవా!" అని ప్రార్థించాడు.

ఋభువు నిదాఘుని మనసారా ఆశీర్వదించాడు.

"నీవు చెప్పిన క్రియాకలాపాలన్నీ ఏకాగ్రత సాధించడానికీ, మనసు నిర్మలం చేసుకోవడానికీ అవసరమే. అటుపైన సాగవలసింది నిరాకార నిర్గుణ పరబ్రహ్మను సర్వ జీవరాశిలోనూ సందర్శించగలగడం కోసమైన జ్ఞానసాధనే. భవనం పైకి వెళ్లాలంటే ఒక్కొక్కటిగా మెట్లెక్కి వెళ్లాలి. మెట్లు కట్టినదీ, భవనం కట్టినదీ ఒక్కటే పదార్థంతోనే గదా! ఇవి ఎక్కితే చాలులే అనుకోకూడదు. ఇవి సహాయకారులు మాత్రమే గమ్యం వేరే ఉంది. అది నిరంతరం స్మృతిపథాన ఉంచుకొని, ఆత్మ పరిశీలన చేసుకుంటూ ముందుకు సాగాలి నాయనా!" అని చెప్పి వెళ్లిపోయాడు ఋభువు. నిదాఘుడు గురుమార్గంలో ప్రస్థానం ప్రారంభించాడు. మన సంగతేమిటి!

# శ్యామకర్ణ

**- తిరుమలశెట్టి సుబ్బారావు**

కసం అనే గుర్రముల వ్యాపారి తన వద్ద గల ఒక గుర్రమునకు ఎంత కాలము గడచినను సంతానప్రాప్తి కలుగకుండుటచే, అతను దానికి సంతానము కలిగినచో మొదటి సంతానమును బాబాకు సమర్పించెద నని మ్రొక్కుకొనెను. బాబా కృప వలన దానికి అనతికాలములోనే సంతాన ప్రాప్తి కలిగెను. గుర్రాల వ్యాపారి కసం తాను మ్రొక్కుకున్న ప్రకారం దానిని బాబాకు సమర్పించెను. దాని శరీరము గోధుమవర్ణములోను, చెవులు నల్లగాను ఉండుటచే బాబా దానికి 'శ్యామకర్ణ' అని పేరు పెట్టెను. శ్యామకర్ణ బాబాను మిక్కిలి ప్రేమించెడిది, ఆరాధించెడిది. బాబా కూడా దానియందు అపరిమితమైన అనురాగము చూపెడివాడు. దీనికి నాట్యములో తర్ఫీదు

నిచ్చిన వ్యక్తి కృష్ణా జి.కె.ఖస్ గీవాల. కాగా దీని సంరక్షణాభారమును మాధవ్ ఫస్లే చూసెడివాడు. బాబా ఇతనిని "ఘోడావాలా" అని పిలిచెడివాడు. ద్వారకామాయి తూర్పు గోడను ఆనుకొని ఉన్న "శ్యామకర్ణహాల్" నందు దీనికి వసతి ఏర్పరిచిరి.

ప్రతి ఆరతికి శ్యామకర్ణ ద్వారకామాయి సభామండపము నందు ప్రస్తుతము కూర్మము గల ప్రదేశమున నిలబడి ఆరతికి అనుగుణముగా నాట్యము చేసెడిది. అది నాట్యము చేయు సమయమున దాని కాళ్ళకు గల చిరుమువ్వల శబ్దము ఆరతికి లయబద్ధముగా ఉండెడిది. హారతి అయిన తర్వాత ద్వారకామాయి ప్రవేశ మెట్ల మీద నుండి బాబాకు సాష్టాంగప్రణామము చేయగా, బాబా దాని నుదుట ఊదినిపెట్టి ఆశీర్వదించిన తర్వాత భక్తులకు ఊదిని ప్రసాదించెడివారు.

చావడి ఉత్సవమునాడు దీని కాళ్ళకు చిరుమువ్వలు, మెడకు చిన్న మువ్వలు గల పట్టి, మూపురమున సుందరమైన పట్టువస్త్రముతోను, వాలము, అందమైన వస్త్రముతోను అలంకరించెడివారు. ఈ అలంకరణ వస్తువులు అన్నియు ప్రస్తుతము ఎగ్జిబిషన్ హాలునందు మనం చూడవచ్చును. చావడి ఉత్సవమునాడు అందరికంటే ముందు ఉండి, వాద్యములకు అనుగుణముగా నృత్యము చేయుచు, అందరిని ఆకర్షించెడిది. బాబా చావడిలో ప్రవేశించి తన ఆసనమున ఆశీనులు కాగానే బాబాకు ఎదురుగా నిలబడెడిది.

బాబా మహాసమాధి చెందిన తర్వాత ఆరతి సమయములో సమాధి మందిరములోను, గురువారమునాడు జరుగు చావడి ఉత్సవములలోను పాల్గొనెడిది. బాబాకు అత్యంత ప్రీతిపాత్రమైన ఈ అశ్వరాజము 1945 సం॥లో సమాధి చెందెను. దీని సమాధి లెండీవనమునందు గల దత్త మందిరమునకు వెనుక గలదు.

షిరిడీ వాస్తవ్యుడైన బాబా సాహెబ్ శ్యామకర్ణ విగ్రహము సమర్పించెను.





# ప్రశాంతి

ఇది ఒక యతీశ్వరుడు నడయాడిన చోటు. పాతికేళ్లుగా నిరంతర సత్సంగాలు నడుస్తున్న తావు-శ్రీ సాయినాథుల వారికన్నా ముందరే వారెక్కడ ప్రతిష్ఠింపబడాలో తామే లిఖితపూర్వకంగా చూపిన ఆలయం- పూలతోటలాంటి చక్కని పాఠశాల, ఆనందోత్సాహాలతో తిరిగే శిశమందిరం వంటివి ఉన్న 33 ఎకరాల వైశాల్యం ఉన్న ప్రదేశం. అలాంటి యీ -

సాయిధామంలోని వానప్రస్థాశ్రమం ప్రశాంతి. ఆధ్యాత్మిక చింతన, కొంతయినా సేవాదృక్పథం ఉన్న - 55 సం॥ పైబడిన 75 సం॥ దాటని వృద్ధులెవ్వరికైనా యిది సాదరంగా స్వాగతం పలుకుతుంది.

## ఆశ్రమం కల్పించేవి

- చక్కని ప్రశాంత ప్రకృతి సహజ వాతావరణం.
- సాత్త్వికమైన అల్పాహార, భోజనాలు.
- నిత్య సత్సంగం.
- కులభేదాలు లేని సమభావం.
- సాయిబాబా, దత్త దేవాలయాలు, భారతమాతల నిత్య సందర్శనభాగ్యం.
- సమీపంలోనే వైద్య సదుపాయం.
- మంచి గ్రంథాలయం.

## ఆశ్రమంలో చేరదలచుకొన్నవారి బాధ్యతలు

- ఆశ్రమ ప్రశాంతతకు అనుగుణంగా ఉండటం.
- సేవా కార్యక్రమాలకు చేతనైనంతగా సహకరించడం
- వారి వసతికీ, భోజనాదికాలకూ చెల్లించవలసిన రుసుమును సక్రమంగా చెల్లించటం.

**ప్రశాంతిలో చేరదలచిన వారు దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.**

**పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి**
**దివ్యాశీస్సులతో,**
**ధర్మాధికారి**
**ఫోన్స్ : 9440413455, 9848133565**